నేటి కందం- నేటికి అందం

**మూసీ నది ప్రక్షాళన**
**కోసము తొలి యడుగు వేయ గోరుచు సీ యం**
**గోసన మొనరించి మిగుల**
**భాసురముగ మొదలు పెట్టె ప్రాజెక్టు పనుల్ !!**

మూసీ నది ప్రక్షాళన కొరకై సీ యం రేవంత్ రెడ్డి ప్రకటన చేసి ఈరోజు ప్రాజెక్టు పనులు ప్రారంభించారు



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

**పార్టీ పిరాయించినోళ్లకు**
**ఫికరెందుకు ఇంకా పైనా**
**తాము మారలేదంటే**
**తప్పునంటా తప్పులైనా**
**సర్కారు తలుచుకుంటే**
**స్పీకర్ ది ఏముంది**
**చట్టంలో లొసుగులెన్నో**
**సద్దుమణిగి పోనుంది**



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 10-9-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:33 పేజీలు:6 వెల: రూ.1/-


## కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ (మంగళవారం) పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయ్యారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు.

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల సంభవించిన నష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనాలను ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి ఇచ్చింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. తెలంగాణలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రత్యేక నిధులతో పాటు, రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సమావేశంలో ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్ పాల్గొన్నారు.

## గ్రూప్-1 పరీక్షపై హైకోర్టు కీలక తీర్పు

### మళ్లీ మూల్యాంకనం చేయండి.. గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేసిన హైకోర్టు

హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గ్రూప్-1 పరీక్షపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మెయిన్స్ పరీక్ష పేపర్లను మళ్లీ మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశించింది. రీవాల్యుయేషన్ ఆధారంగా ఫలితాలు వెల్లడించాలని సూచించింది. పునఃమూల్యాంకనం సాధ్యం కాకపోతే ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షల నిర్వహణను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటీషన్లపై జూలై 7న వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్ కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తన తీర్పును వాయిదా వేస్తున్నట్టు జూలై 7న ప్రకటించారు.

## భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయేదే గెలుపు

# భారత కొత్త ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమికే గెలుపు సొంతమైంది. ఇక భారతదేశానికి కొత్త ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కాబోతున్నారు. ఇండీ కూటమి నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేసిన బి.సుదర్శన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ(మంగళవారం) భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈ సాయంత్రం 5 గంటలకు ముగియగా, ఓట్ల లెక్కింపు అనంతరం రాత్రి 7:30 గంటలకు ఫలితాలు వెలువరించారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. మొత్తంగా 781 అర్హులైన ఎంపీలలో, 767 మంది ఓటు వేశారు. ఇది 98.2 శాతం ఓటర్ టర్నౌట్‌ను సూచిస్తుంది. ఈ ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ మొత్తం 152 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ విజయం ఆయన రాజకీయ అనుభవాన్ని, ఎన్డీఏ కూటమి బలాన్ని ప్రతిబింబించింది. అదే సమయంలో కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు క్రాస్-ఓటింగ్ చేయడం వల్ల ప్రతిపక్షపార్టీలో చీలికలు ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయి.

ఎన్డీఏ అభ్యర్థి, ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ భారతదేశ 17వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఆయన, తన ప్రత్యర్థి ఇండియా బ్లాక్ అభ్యర్థి బి సుదర్శన్ రెడ్డిని సునాయాసంగా ఓడించారు. మొత్తం 767 ఓట్లలో రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించగా, ప్రత్యర్థి, ఇండీ కూటమి అభ్యర్థి 300 ఓట్లు సాధించారు. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు క్రాస్-ఓటింగ్ చేయడం వల్ల ప్రతిపక్షపార్టీలో చీలికలు కనిపించాయి.

అర్హత కలిగిన 781 మంది ఎంపీలలో, 767 మంది ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 98.2 శాతం ఓటింగ్ నమోదైంది. 752 ఓట్లు చెల్లుబాటు కాగా, 15 చెల్లవని రిటర్నింగ్ అధికారి పిసి మోడి విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

# ప్రతి గ్రామానికి నర్సింగ్ సేవలు

## -వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ



మెదక్, సెప్టెంబర్ 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యరంగంలో మరో ముఖ్యమైన అడుగు వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, ప్రతి జిల్లాలో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ప్రారంభించనుంది.

ఈ క్రమంలో 34 మొబైల్ స్క్రీనింగ్ వాహనాలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార్ రాజనరసింహ అన్నారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీ నుండి వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన మాట్లాడారు.

క్యాన్సర్ అనేది అత్యంత ప్రమాదకరమైన ఎన్సీడీ వ్యాధి అని, సమయానికి గుర్తించకపోతే రోగి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు క్యాన్సర్ పై అవగాహన లోపం, నిర్ధారణ ఆలస్యం ప్రధాన సమస్యలుగా ఉన్నాయని అధికారులు తెలిపారని చెప్పారు.

ఈ లోటును నివారించేందుకు గ్రామీణ స్థాయిలో స్క్రీనింగ్ వాహనాల ద్వారా ప్రతి కుటుంబానికీ నిర్ధారణ పరీక్షలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిమ్స్, ఎంజీఎం ప్రముఖ ఆసుపత్రుల్లో 80 పడకలతో ప్రత్యేక క్యాన్సర్ విభాగాలు కొనసాగుతున్నాయని మంత్రి దామోదర్ అన్నారు. రాబోయే నెలల్లో వరంగల్, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆధునిక రేడియేషన్ బంకర్లతో కూడిన డే కేర్ సెంటర్లు కూడా ప్రారంభించనున్నారు.

దీని ద్వారా రోగులు ఉదయం చికిత్స పొందిన తరువాత అదే రోజున సాయంత్రం తమ ఇంటికి తిరిగి వెళ్లేలా చేయడం, ఆర్థిక భారాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రఖ్యాత నిపుణుడు డాక్టర్ నూరి దత్తాత్రేయ గారిని "అడ్వైజర్- క్యాన్సర్ ఎలిమినేషన్"గా నియమించి, ఆయన అనుభవాన్ని రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అదే సమయంలో నర్సింగ్ రంగంలో కూడా ప్రభుత్వం కొత్త అవకాశాలను కల్పిస్తోందని మంత్రి దామోదర్ అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి నర్సింగ్ అధికారులను అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా, ప్రతి సంవత్సరం 3,000 మంది విద్యార్థులకు నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 35 బీఎస్సీ నర్సింగ్ కళాశాలలు, 183 జీఎన్ఎమ్ నర్సింగ్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు జర్మన్ లాంగ్వేజ్ సహా అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి, గ్లోబల్ అవకాశాలు కల్పించే దిశగా కూడా చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

## శ్రీనివాస కళ్యాణంపై విజిలెన్స్ విచారణ : టీటీడీ

తిరుపతి, సెప్టెంబర్ 9: రెండురోజుల క్రితం యునైటెడ్ కింగ్‌డమ్ (యు కె) దేశంలో ఒక ప్రైవేటు సంస్థ తమ పేరు వినియోగించి నిర్వహించిన శ్రీనివాస కళ్యాణంపై సమగ్ర విచారణకు తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ) మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. యూకేలోని శ్రీ అద్వైత సేవా సమితి పేరుతో ఓ సంస్థ ఈ నెల 6వ తేదీన యు కె లోని స్లాఫ్ ఎస్ ఎల్ 13 ఎల్ డబ్ల్యూ వద్ద నున్న సింగ్ సభ స్లాఫ్ స్పోర్ట్స్ సెంటర్ లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన పత్రిక వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ అయింది.

ఆ శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి ఏపీఎన్ఆర్టీఎన్ నుండి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. టీటీడీ కూడా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. అయినప్పటికీ ఆహ్వాన పత్రికలో టీటీడీకి చెందిన లోగోను వాడారు.

అంతేకాక ఆహ్వాన పత్రిక లో ఉచితం అని పేర్కొన్నప్పటికీ ప్రత్యేక సేవలకు సంబంధించిన వివరాలు ఇవ్వలేదు. ఆ ఆహ్వాన పత్రంపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా, భక్తుల రిజిస్ట్రేషన్ వివరాలతో పాటు సేవా ఫీజు (566 పౌండ్లు) వసూలు చేస్తున్నట్లు సమాచారం కనిపించింది. డబ్బులు వసూలు చేసే అంశంతో పాటు టిటిడి కల్యాణ లడ్డూ ప్రసాదం, ఒక వెండి లాకెట్, ఒక నవరమ్ వేద వస్త్రం, అక్షింతలు, పసుపు, అమ్మవారి కుంకుమ, చీర, మంగళ్యం ధారం, జాకెట్టు, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఫోటో ఫ్రేమ్ ఉన్నాయి.

సదరు నకిలీ శ్రీనివాస కల్యాణ మహోత్సవంపై ఫిర్యాదు రావడంతో చర్యలకు విజిలెన్స్ శాఖ ను టిటిడి ఆదేశించింది.

టీటీడీ పేరు వాడుకుంటూ ఇటువంటి కల్యాణాలను నిర్వహించడం భక్తులను మోసం చేయడమేనని టీ టీ డీ పేర్కొంటోంది. ఆ కల్యాణ నిర్వహణకు సంబంధించి సమగ్ర విచారణ చేయాలని విజిలెన్స్ విభాగాన్ని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు టీటీడీ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ టీ. రవి ప్రకటించారు. భక్తులను గందరగోళానికి గురిచేసే అనధికార కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని టిటిడి సూచించింది. టిటిడి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా టిటిడి పేరుతో శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

నకిలీ కల్యాణోత్సవాల పేరుతో ఎవరైనా సమాచారాన్ని వైరల్ చేసి డబ్బులు కోరితే టిటిడి విజిలెన్స్ విభాగం దృష్టికి తీసుకురావాలని కోరుతోంది.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 9: చెక్ బౌన్స్ కేసులో కోర్టు కమిషన్ తరఫున ఎన్‌బీడబ్ల్యూ నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన ఆదిలాబాద్ న్యాయవాదులు కౌశిక్ సింగ్, మనోజ్ లపై నిన్న రాత్రి నిందితులు దాడి చేసి గాయపరిచారు. విధి నిర్వహణలో న్యాయవాదులపై నిందితుల దాడిని ఖండిస్తూ ఈరోజు ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కోర్టుతో పాటు అన్నికోర్టుల విధులను న్యాయవాదులు బహిష్కరించారు.

నిందితులు సోపన్ కాంబ్లే, వర్షా కాంబ్లే లను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని, న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంద్రాల నగేష్, ప్రధాన కార్యదర్శి డీఎస్పీ శర్మ, ఉపాధ్యక్షులు చందు సింగ్ డిమాండ్ చేశారు. ఈ దాడిని బార్ అసోసియేషన్ కార్యవర్గం తీవ్రంగా ఖండించారు. కోర్టు ప్రధాన గేటు వద్ద నల్ల బ్యాడ్జిలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. దాడి చేసిన నిందితులకు ఎవరూ న్యాయ సహాయం అందించకూడదని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వం నిషేధం

## నిషేధం విధించడాన్ని నిరసిస్తూ యువత నిరసన

# హింసాత్మకంగా మారిన నిరసన

## 20 మంది మృతి.. 300 మందికిపైగా గాయాలు

### –నేపాల్‌లో రాజకీయ సంక్షోభం..? మంత్రుల రాజీనామా.. దుబాయ్‌కి ప్రధాని ఓలి..!





న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నేపాల్ లో సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వం నిషేధం విధించడాన్ని నిరసిస్తూ ఆ దేశ యువత చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. వేలాది మంది జనరేషన్ జెడ్ ఆందోళనకారులు సోమవారం దేశ రాజధాని కాఠ్మాండులో చేపట్టిన ఉద్యమం రణరంగాన్ని తలపించింది. ఈ నిరసనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 300 మందికిపైగా గాయపడ్డారు. యువత హింసాత్మక నిరసనల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల నిషేధంపై నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్‌తోసహా 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లను నిషేధిస్తూ ఈ నెల 4న తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. అయినప్పటికీ నిరసనలు చల్లారట్లేదు. మరోవైపు రాజధాని సహా పలు ప్రధాన నగరాల్లో సైన్యం మోహరించింది.

### రాజకీయ సంక్షోభం..?

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. నేపాల్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినట్లు తెలుస్తోంది. ఆ దేశ ప్రధాని కేపీ ఓలి రాజకీయ సంక్షోభంలో ఇరుక్కున్నారు. ఇప్పటికే పలువురు కేబినెట్ మంత్రులు రాజీనామా చేశారు. హోంమంత్రి రమేష్ లేఖక్ అధికారికంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

కేబినెట్ సమావేశంలో లేఖక్ తన రాజీనామాను ప్రధాని ఓలికి సమర్పించారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి రామ్‌నాథ్ అధికారి, ఆరోగ్య శాఖ మంత్రి ప్రదీప్ పౌడేల్ కూడా తమ పదవులకు రిజైన్ చేశారు. దీంతో నేపాల్‌లో రాజకీయ సంక్షోభం నెలకొనే పరిస్థితి తలెత్తింది.

### దుబాయ్‌కి ప్రధాని ఓలి..

తాజా పరిస్థితుల నేపథ్యంలో నేపాల్ ప్రధాని కేపీ ఓలి దేశం విడిచి పారిపోయేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన దుబాయ్ కి వెళ్లేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం.

హిమాలయ ఎయిర్‌లైన్స్ అనే ప్రైవేట్ విమానయాన సంస్థకు చెందిన ఫ్లైట్‌లో ఆయన దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆయన ఇప్పటికే ఉప ప్రధాన మంత్రికి తాత్కాలిక బాధ్యతలు కూడా అప్పగించినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఓలి వైద్య చికిత్స నిమిత్తం దుబాయ్ వెళ్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# వ్యవసాయం, రైతుల అభివృద్ధికి ఒక వరం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: వ్యవసాయం, పాడి పరిశ్రమలలో కొత్త జీఎస్టీ రేట్లు (వస్తు సేవల పన్ను) విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. జీఎస్టీ ధరల తగ్గింపుతో దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, వ్యవసాయ, పాడి పరిశ్రమ కార్మికులు పశు పోషకులు ఆనందం వ్యక్తం చేస్తూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కొత్త ధరలను విప్లవాత్మక నిర్ణయంగా అభివర్ణిస్తూ, భవిష్యత్తులో చారిత్రాత్మక మార్పులకు నాంది పలకనున్నాయని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

జీఎస్టీ సంస్కరణల ప్రభావం ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతులపై స్పష్టంగా కనిపిస్తుంది. వ్యవసాయ యంత్రాలు, సౌరశక్తి పరికరాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల సాగు ఖర్చులు తగ్గి, రైతులకు లాభాలు పెరుగుతాయి. జీవాధారిత క్రిమి సంహారకాలు, సూక్ష్మపోషకాలపై జీఎస్టీ తగ్గింపు.. రైతులకు గణనీయమైన లాభాలను అందిస్తాయి. రసాయన ఎరువుల నుంచి బయో ఎరువుల వైపు మొగ్గుచూపేందుకు రైతులను ప్రోత్సహిస్తుంది. పాలు, జున్నుపై ప్రస్తుతం జీఎస్టీని పూర్తిగా తొలగించడంతో సాధారణ ప్రజలతోపాటు రైతులు, పశు సంరక్షకులు, పాల ఉత్పత్తిదారులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. జీఎస్టీ సంస్కరణలు సమగ్ర వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీని వల్ల వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుసంవర్ధకం, తేనెటీగల పెంపకం, మత్స్య సంపద, వ్యవసాయ అటవీ వ్యవస్థ, కోళ్ల పెంపకంలో స్పష్టమైన లాభాలు అందుతాయి. బీడీ ఆకులపై జీఎస్టీ ధరలు తగ్గించడంతో గిరిజనుల జీవనోపాధి మరింత మెరుగవుతుంది. వాణిజ్య సరుకు రవాణా వాహనాలపై పన్ను తగ్గడంతో వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఖర్చు తగ్గి, రైతులకు మరింత లాభం చేకూరుతుంది.

# బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తోంది-కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 9: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తుందని మండిపడ్డారు. మండల, గ్రామస్థాయి నాయకులను తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. జడ్చర్లలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

బీఆర్ఎస్ నాయకుల మీద కాంగ్రెస్ సర్కార్ కేసులు పెడుతుంది.. దేవరకద్రలో మండల పార్టీ ప్రెసిడెంట్ మీద లేని కేసు పెట్టి జైలుకు పంపించారు. పార్టీ మారితే కేసు తీసేస్తాం.. పార్టీ మారకపోతే జైల్లో వేస్తాం అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే నాయకులపై కక్ష సాధింపు చర్యలుకు పాల్పడుతున్నారు. పోలీసులు, జీఎస్టీ అధికారులను పంపించి మానసికంగా వేధిస్తున్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా చౌకబారు రాజకీయం జరుగుతుంది. ఇకనైనా కళ్లు తెరిచి, నిద్రలో నుంచి మేల్కొని, బయటకు వచ్చి.. వెంటనే పాలమూరు ఎత్తిపోతలను సత్వరమే పూర్తి చేయాలి. ఇది పూర్తి చేస్తే జిల్లా రైతాంగం, మేం అభినందిస్తాం. లేదంటే ప్రజల తరపున నిలదీస్తాం.. ఎండగడుతాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# ముగిసిన వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమం



నల్గొండ, సెప్టెంబర్ 9:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని పలు ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల్లో శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. నల్లగొండ మున్సిపల్ సహాయ కమిషనర్ రవీందర్ రెడ్డి రాంనగర్ మున్సిపల్ పార్కులో చేపట్టిన శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల ప్రణాళిక సందర్భంగా నల్లగొండ పట్టణంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. చిన్న, పెద్ద కాల్వల్లో కార్మికులతో కలిసి పూడికతీత పనులు చేపట్టినట్లు చెప్పారు. వన మహోత్సవ కార్యక్రమంలో చెట్లను నాటి వాటి సంరక్షణ కార్యక్రమాలు చేయడంతో పాటు ఇంటింటికి చెట్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అనధికార భవనాలను గుర్తించి వాటికి అలైన్‌మెంట్లు చేసి భువన యాప్‌లో వివరాలు పొందుపరచడం జరిగిందన్నారు. అక్రమంగా ఉన్న ట్రేడ్ లైసెన్స్, నల్లాలను గుర్తించి వాటిని రెగ్యులర్ చేయడం జరిగిందని తెలిపారు. తడి, పొడి, హానికార చెత్తపై పట్టణ వాసులకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలు నిరంతరం కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గడ్డం శ్రీనివాస్, నంద్యాల ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.




ఆహ్వానం

పేరూరు బాలసుబ్రమణ్యం కవితా సంపుటి

'ఉగ్గుపాలనుండే...'

ఆవిష్కరణ సభ

13 సెప్టెంబర్ 2025

శనివారం ఉదయం 09.30 గం॥లకు

వేదిక : వేమన విజ్ఞాన కేంద్రం, యశోదనగర్, తిరుపతి.

నిర్వహణ

యువశ్రీ మురళి డా॥ నెమిలేటి కిట్టన్న శ్రీ మల్లారపు నాగార్జున

అభ్యుదయ రచయితల సంఘం & వేమన విజ్ఞాన కేంద్రం

తిరుపతి జిల్లా శాఖ.


# మాటలకు చేతలకు పొంతన లేదు : కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఆయన కేబినెట్‌లోని మంత్రుల మాటలకు చేతలకు పొంతన లేదు అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. సీఎం, మంత్రులు అసహనంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో కొప్పుల ఈశ్వర్ మీడియాతో మాట్లాడారు.

సంక్షేమ మంత్రి లక్ష్మణ్ కుమార్ గురుకులాల పరిస్థితి గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కేసీఆర్ హయాంలోనే గురుకులాల పరిస్థితి బాగాలేదని చెప్పడం హాస్యాస్పదం. సీఎం నియోజకవర్గంలో ఉన్న గురుకుల పాఠశాలను సందర్శిద్దామా.. పరిస్థితులు ఎలా ఉన్నాయో అక్కడే తేలుద్దాం. గురుకులాల్లో ప్రతి రోజు ఏదో ఒక ఘటన జరిగి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. లక్ష్మణ్ కుమార్ నిన్న గాక మొన్న మంత్రి అయ్యారు. ఆయన అహగాహన లేమితో మాట్లాడుతున్నారు. కేసీఆర్ హయంలో గురుకులాల సంఖ్య 1024కు పెంచాం. దాదాపు ఆరులక్షల మందికి గురుకుల విద్య లభిస్తోంది. వివిధ రాష్ట్రాల అధికారులు, నేతలు కేసీఆర్ హయంలో గురుకులాల గొప్పతనాన్ని తెలుసుకునేందుకు తెలంగాణకు వచ్చి వెళ్లారు అని కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు.

22 నెలల కాంగ్రెస్ దుర్మార్గపు పాలనలో గురుకులాల్లో వంద మందికి పైగా విద్యార్థులు చనిపోయారు. విద్యార్థుల దీనావస్థల గురించి సీఎంకు, మంత్రికి పట్టింపు ఉందా.. తన ధర్మపురి నియోజకవర్గంలో గురుకుల భవనాన్ని పూర్తి చేయని అసమర్థ మంత్రి లక్ష్మణ్ కుమార్. ఏనాడైనా గురుకులాలపై సీఎం, మంత్రి సమీక్ష చేశారా. గురుకులాలకు పక్కా భవనాలు కేసీఆర్ హయంలో నిర్మించలేదు అనేది అబద్ధం. కట్టిన పక్కా భవనాలు నేను మంత్రికి చూపిస్తా.. సిద్ధమేనా.. గురుకులాల్లో విద్యార్థుల మరణాలు రేవంత్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్ చేసిన హత్యలే. కనీసం విద్యార్థులకు తిండి పెట్టని అసమర్థ ప్రభుత్వం ఇది. వాస్తవాలు ఎదుర్కొనే దమ్ము లేకే మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి లక్ష్మణ్ కుమార్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. మా ప్రశ్నలకు జవాబు చెప్పు. మీతో చర్చకు హరీష్ రావు అవసరం లేదు అని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో రెండేళ్లుగా డ్రామా నడుపుతున్నారు. ఇప్పటి వరకు ఓ భవనం పూర్తి చేసింది లేదు. ఒక్కరిని చూసి ఇంకొకరు అబద్దాలు ఆడటం నేర్చుకున్నారు. సీఎం మెప్పు కోసం లక్ష్మణ్ కుమార్ అబద్దాలను ప్రచారం చేస్తున్నారు. గురుకుల విద్యార్థులే రోడ్లపైకి వచ్చి ధర్నా చేస్తున్నా ప్రభుత్వానికి కనిపించడం లేదా.. గురుకులాల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు లేవు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరచి గురుకులాల స్థితిగతులు మెరుగు పరచాలి. ఊహల్లో ఊరేగుతూ కేసీఆర్‌పై అనవసర విమర్శలు చేస్తున్నారు. వాటిని మానండి అని కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు.

గురుకులాల్లో జీవో 17 తెచ్చి 9 వేల మంది చిన్న కాంట్రాక్టర్ల పొట్ట గొట్టారు. ఐదారు నెలలుగా వారికి బిల్లులు ఇవ్వకపోగా ఇపుడు వారి సేవలనే వద్దనుకుంటున్నారు. స్కూళ్ళ, గురుకులాల్లో కోడి గుడ్ల ధర పెంచి 600 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. ఇందులో మంత్రి లక్ష్మణ్ కుమార్ వాటా ఎంతో చెప్పాలి. బెస్ట్ ఎక్సెలెన్స్ స్కూళ్లలో అడ్మిషన్లు ఎందుకు తగ్గాయో చెప్పాలి. నీకు మంత్రి పదవి వస్తే చాలా లక్ష్మణ్ కుమార్? విద్యార్థుల బాగోగులు పట్టవా..? గురుకులాల్లో చనిపోయిన 110 మంది విద్యార్థుల జాబితా ప్రభుత్వానికి పంపుతున్నా.. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించే తీరిక మంత్రికి లేదా. కేసీఆర్, హరీష్ రావుపై విమర్శలు చేస్తే పెద్ద వాడివై పోవు లక్ష్మణ్ కుమార్. ఇప్పటికైనా మంత్రినని సోయి తెచ్చుకుని పని చేయ్ అని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు.

# దూప్‌సింగ్ తండా వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

మెదక్, సెప్టెంబర్ 9:లయన్స్ క్లబ్ ఆఫ్ మెదక్ మంజీర ఆధ్వర్యంలో హవేళి ఘనపూర్ మండల పరిధిలోని దూప్‌సింగ్ తండా వాసులకు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దాదాపు 70మంది కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు.

ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ మెదక్ ఆధ్వర్యంలో మెదక్, కామారెడ్డి జిల్లాలో వరదలతో ఇబ్బందులు పడిన తండావాసులకు తమ క్లబ్ అండగా నిలుస్తుందన్నారు.

త్వరలోనే మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని ముంపునకు గురైన బాధితులకు చేయూతనిచ్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు సేవలందించేందుకు లయన్స్‌క్లబ్ ఎప్పుడు అండగా నిలుస్తుందన్నారు.

పేదల ప్రజలకు సేవలందించేందుకు సభ్యులు సమిష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. క్లబ్ సభ్యుల సలహాలు, సూచనలు మేరకు రాబోయే రోజుల్లో తమ క్లబ్ మరిన్ని సేవలు చేసి ప్రజల మన్ననలు పొందుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బసవేశ్వరరావు, గంప రమేష్, వైస్ గవర్నర్ నర్సింహారాజు, ప్రవీణ్, పద్మావతి, సూర్యనారాయణ, రాయకంటి నాగరాజు, కిషన్‌గుప్త, లయన్స్ క్లబ్ మెదక్ మంజీరా అధ్యక్షుడు వనపర్తి వెంకటేశం, కార్యదర్శి వెంకటరమణ, రాజు, నీలకంఠం, డాక్టర్ పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్ లో సార్వజనీన తపాలా సదస్సులో చరిత్రాత్మక యూపీఐ-యూపీయూ అనుసంధానాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:దుబాయ్ లో 28వ సార్వజనీన తపాలా సదస్సులో యూపీఐ-యూపీయూ అనుసంధాన ప్రాజెక్టును కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి సరిహద్దులు దాటి డబ్బులు పంపే ప్రక్రియను సులభతరం చేసేందుకు కీలక ముందడుగు.

ఈ ప్రాజెక్టును తపాలా శాఖ (డీఓపీ), ఎన్ పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్), యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) కలిసి ప్రారంభించాయి. దీని ద్వారా భారతదేశ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ), యూపీయూ అనుసంధాన వేదికతో అనుసంధానించటం వల్ల యూపీఐ వేగం, అందుబాటు ధరతో పోస్టల్ వ్యవస్థ పరిధి విస్తృతమవుతుంది.

దీనిని "సాంకేతిక ప్రయోగం అనడం కన్నా, సామాజిక ఒప్పందం" అనడం సరైందన్నారు సింధియా. "పోస్టల్ నెట్ వర్క్ విశ్వసనీయత, యూపీఐ వేగం వల్ల విదేశాల్లో ఉన్న కుటుంబాలు వేగంగా, సురక్షితంగా, తక్కువ ఖర్చుతో డబ్బును బదిలీ చేసుకుంటాయి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను సరిహద్దులు దాటి అనుసంధానించటం ద్వారా మానవాళికి మెరుగైన సేవలందించవచ్చని ఇది చెబుతుంది" అని పేర్కొన్నారు.

భారతదేశపు ఆధునిక, సమ్మిళిత పోస్టల్ రంగం దృష్టిని సింధియా నాలుగు విధాలుగా వివరించారు. డేటా ఆధారిత లాజిస్టిక్స్ ద్వారా నిరంతరాయంగా అనుసంధానం చేయటం, ప్రతి వలసదారుడు, డిజిటల్ సంస్థకు తక్కువ ఖర్చుతో డిజిటల్ ఆర్థిక సేవలు అందించి వారిని భాగస్వాములను చేయటం, ఏఐ, డిజిపిన్, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలతో పోస్టల్ రంగాన్ని ఆధునీకీకరించటం, యూపీయూ సాంకేతిక విభాగంతో దక్షిణాది దేశాల మధ్య భాగస్వామ్య సహకారం.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా దార్శనికత, వికసిత్ భారత్ దిశగా చేస్తున్న కృషికి ఇండియా పోస్ట్ విస్తృతి, సమ్మిళితత్వం శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తాయని సింధియా తెలిపారు. "ఆధార్ సేవలు, జన్ ధన్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా 560 మిలియన్ కు పైగా ఖాతాలను ప్రారంభించాం. అందులో ఎక్కువగా మహిళలే ఉన్నారు. గతేడాది భారత తపాలా శాఖ 900 మిలియన్లకు పైగా ఉత్తరాలు, పార్శిళ్లను గమ్యస్థానాలకు చేర్చింది. మేం ప్రపంచవేదికపై ప్రదర్శిస్తున్న విస్తృతమైన, భాగస్వామ్య స్ఫూర్తి ఇదే" అని స్పష్టం చేశారు.

ఈ సాంకేతికతను ఆవిష్కరణ వైపు మళ్లించేందుకు, ఈ-కామర్స్, డిజిటల్ చెల్లింపులపై దృష్టి సారించటానికి 10 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని సింధియా ప్రకటించారు. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ.. వనరులు, నైపుణ్యాలు, స్నేహభావంతో భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పునరుద్ఘాటించారు.

యూపీయూలో కౌన్సిల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, పోస్టల్ వ్యవహారాల మండళ్లకు భారత అభ్యర్థులను సింధియా ప్రకటించటం ద్వారా గ్లోబల్ పోస్టల్ కమ్యూనిటీ కోసం అనుసంధానత, సమ్మిళిత, సుస్థిరమైన భవిష్యత్ నిర్మాణానికి భారతదేశ నిబద్ధత స్పష్టమవుతోంది.

"ప్రతిపాదనలతో కాదు.. భాగస్వామ్యంతో భారత్ మీ దగ్గరకు వస్తుంది. పరస్పర సహకారం ద్వారా లభించే పరిష్కారాలను మేము విశ్వసిస్తాం. అవి విభజన ఖర్చును తగ్గించి, లావాదేవీలు సజావుగా సాగటానికి చెల్లింపులు, గుర్తింపు, చిరునామా, రవాణాలను అనుసంధానిస్తాయి" అంటూ దుబాయ్ లో జరిగిన 28వ యూనివర్సల్ పోస్టల్ సదస్సులో సింధియా తన ప్రసంగాన్ని ముగించారు.

# లింగంపల్లి గురుకుల పాఠశాల పాత డార్మెటరీ బ్లాకుకూలిన ఘటనలో విద్యార్థులు సురక్షితం

-జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య .

-ప్రమాదం జరిగిన వెంటనే హుటాహుటిన లింగంపల్లి పాఠశాలకు చేరిన కలెక్టర్ .

-పాఠశాలలో చేపట్టిన ఎస్ డి ఆర్ హెచ్ బృందం సహాయక చర్యలను పర్యవేక్షణ.

-రూ.7 కోట్లతో నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు.

-ప్రమాదకరమైన భవనాల వైపు విద్యార్థులు వెళ్లకుండా కౌన్సిలింగ్

-అందుబాటులో ఉన్న సురక్షితమైన గదుల్లో తరగతులు, హాస్టల్ ఏర్పాటు.



సంగారెడ్డి సెప్టెంబర్ 09(నేటి నిజం ప్రతినిది) మునిపల్లి మండలం లోని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ యొక్క పాత డార్మిటరీ బ్లాక్ , మంగళవారం మధ్యాహ్నం కూలిన ఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన కలెక్టర్ లింగంపల్లి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎస్ డి ఆర్ హెచ్ బృందం చేపట్టిన సహాయక చర్యలను కలెక్టర్ పర్యవేక్షించారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మునిపల్లి మండలం, లింగంపల్లి గురుకుల పాఠశాలలో 1984లో నిర్మించిన పాత హాస్టల్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం గోడ కూలిన ఘటన చోటుచేసుకుంది . విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రావిణ్య హుటాహుటిన గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి ఇంటర్ వరకు సుమారు 601 మంది విద్యార్థులు చదువుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలో ఉండడంతో, పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఆ సమయంలో హాస్టల్ భవనం పక్కగా వెళుతున్న ముగ్గురు విద్యార్థులు ఈ ఘటనలో స్వల్పంగా గాయాలయ్యాయని , వారికి జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో ఎస్డిఆర్ఎఫ్ బృందం కూలిన మట్టి తొలగింపు మట్టి శిఖరాల కింద ఉన్న విద్యార్థుల ట్రంకు బాక్సులు వ్యక్తిగత సామాగ్రిని సురక్షితంగా బయటకు తీస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రమాదకరమైన శిథిలావస్థకు చేరిన భవనాల వద్దకు వెళ్లకుండా కౌన్సిలింగ్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు విద్యార్థులకు తాత్కాలికంగా వసతికి ఇలాంటి ఇబ్బందులు లేవని అందుబాటులో ఉన్న తరగతి గదులు మరియు హాస్టల్ గదుల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ శాఖ (ఈ ఈ డబ్ల్యూ ఐ డి సి) అధికారులు సంఘటనా స్థలంలో పాడైన భవనాలను కూల్చివేయడం , వినియోగించటానికి వీలుగా వుండే గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు . రాత్రి సమయంలో పనులు కొనసాగేందుకు తాత్కాలికంగా లైటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గురుకుల పాఠశాలకు నూతన హాస్టల్ భవన నిర్మాణం కోసం రూ .7 కోట్లతో ప్రభుత్వానికి ఆమోదం కోసం ప్రతి పనులకు సమర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు . ప్రస్తుతం పాఠశాలల్లో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని విద్యార్థుల భద్రతకు ఎలాంటి సమస్యలు లేవని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ తరిణి



మెదక్, సెప్టెంబర్ 9: సీజన్ మార్పులతో వచ్చే వ్యాధులు (ావజీబనీనిజీశ్రీ ఆతిబవజీబవబ) దరిదాపులకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని నిజాంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని తరిణి అన్నారు. ప్రతి ఏటా వచ్చే సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇంటి ఆవరణలో మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే ఇంట్లోని మొక్కలను పెంచే తొట్లలో నిలువ ఉన్న నీటిని శుభ్రం చేసుకొని ఉంచాలన్నారు. ఇంటి పరిసరాలలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఉంటే వ్యాధులను నివారించవచ్చని ఆమె తెలిపారు.

వీలైనంత వరకు ఇంటి పరిసరాలలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మురుగునీరు నిలువ ఉన్నట్లయితే ఆచోట్ల దోమలు చేరి వ్యాధులు ప్రభలే అవకాశం ఎంతైనా ఉందన్నారు. పిచ్చి మొక్కలను తొలగించి, తులసి మొక్కలను పెంచినట్లయితే దోమలను నివారించవచ్చని సూచించారు. మనం నిత్యం తినే ఆహార పదార్థాలను బయట నుంచి తీసుకువచ్చిన కూరగాయలను శుభ్రంగా కడుక్కొని నిలువుంచుకోవాలన్నారు. ప్రస్తుతం వస్తున్న ఈ సీజన్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఇంటింటికి తాండాలలో తమ సిబ్బంది ఏఎన్ఎంతోపాటు ఆశ వర్కర్లను పంపించి సీజన్లో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ఉన్నామన్నారు. విష జ్వరాల పట్ల వ్యాధి బారిన పడిన వారికి తగిన మందులు ఇంజక్షన్లు ఇస్తూ మిగతా వారికి స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

# నేడు అత్యాధునిక సౌకర్యాలున్న విద్యుత్ వాహన (ఈవీ) నాణ్యతా పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించనున్న కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:సుస్థిరమైన వాహన రంగాన్ని ప్రోత్సహించి, కార్బన్ ఉద్గారాలను తగ్గించాలనే భారత్ లక్ష్యానికి అనుగుణంగా అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ వాహన (ఈవీ) పరీక్షా కేంద్రాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, నూతన, పునరుత్పాదక శక్తి మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి 2025, సెప్టెంబర్ 10న ప్రారంభిస్తారు. దీనిని కోల్‌కతాలోని అలిపోర్ ప్రాంతీయ ప్రయోగశాలలో ఏర్పాటు చేశారు.

అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాలలో ఈవీ బ్యాటరీలు, భాగాలపై కీలకమైన పరీక్షలు నిర్వహిస్తారు. విద్యుత్ భద్రత, ఎఫ్‌సీసీ/ఐఎస్ఈడీ అమలు, మన్నిక, వాతావరణ పరీక్షలు (ఐపీ, యూవీ, తుప్పు పట్టడం), యాంత్రిక, పదార్థ భద్రత (మండే స్వభావం, గ్లో వైర్ తదితరమైనవి) అంశాలపై పరీక్షలు నిర్వహిస్తారు. ఈవీ బ్యాటరీ తయారీదారులకు ముఖ్యంగా తూర్పు భారత్‌లో విశ్వసనీయమైన అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పరీక్ష, ధ్రువీకరణను అందిస్తుంది. ఉత్పత్తి భద్రత, పనితీరు, నియంత్రణల అమలుకు ఈ కేంద్రం హామీ ఇస్తుంది.

ఈవీల నాణ్యత హామీకి జాతీయ ప్రమాణంగా ఈ కేంద్రం పనిచేస్తుంది. లోపాలను ముందుగానే తయారీదారులు గుర్తించడానికి, ఉత్పత్తి విశ్వసనీయతను పెంచడం, కఠినమైన భద్రత, పనితీరు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి వీలు కల్పిస్తుంది. అలాగే ఈవీ వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంపొందించి, గ్రీన్ మొబిలిటీ దిశగా భారత్ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది.

బలమైన ఈవీ వ్యవస్థను రూపొందించడానికి, ఎగుమతులను తగ్గించడానికీ, చౌకగా లభించే నాణ్యతా పరీక్షల సేవలతో దేశీయ వినియోగదారులను శక్తిమంతం చేయడం పట్ల భారత ప్రభుత్వ నిబద్ధతను ఈ కేంద్రం ప్రతిబింబిస్తుంది. ఈ అభివృద్ధితో, సుస్థిర రవాణా వ్యవస్థను సాధించే దిశగా భారత్ పరివర్తనకు, నాణ్యతా ప్రమాణాలకు హామీ ఇచ్చే మౌలిక వసతులను కల్పించడంలో ప్రపంచ అగ్రగామిగా భారత్ ఎదగడంలో ఎన్‌టీహెచ్ తన పాత్రను బలోపేతం చేసుకుంటుంది.

శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని, కర్బన ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తూ.. పర్యావరణహిత రవాణా పరిష్కాల దిశగా ప్రపంచ పరివర్తనలో ఎలక్ట్రిక్ వాహనాలు ముందంజలో ఉన్నాయి. 2030 (30ఏ30) నాటికి 30 శాతం ఈవీల విస్తరణ సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ లక్ష్యానికి మద్దతు ఇచ్చేందుకు.. ఈవీలు, వాటికి సంబంధించిన భాగాలు జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కఠినమైన పరీక్ష, ప్రామాణికం, ధ్రువీకరణ పొందాయని నిర్ధారించుకోవడం చాలా అవసరం.

# ప్రజావాణికి 36 ఫిర్యాదులు

హైదరాబాద్, సెప్టెంబర్ 9:పార్కులు, రహదారులు, చెరువుల వంటి ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జా విషయంలో పలువురు స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం బుద్ధభవన్లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 36 ఫిర్యాదులు అందాయని హైడ్రా సిబ్బంది తెలిపారు.

కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలోని చిన్న బంధం చెరువును ఇరువైపుల నుంచి కబ్జాలు చేసేస్తున్నారని, చెరువులోని నీళ్లన్నీ కిందకు వదిలేస్తున్నారని గాజుల రామారం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువు వాస్తవ విస్తీర్ణం ఎంతనేది నిర్ణయించి ఫెన్సింగ్ చేయాలని కోరారు. రాజేంద్రనగర్ మండలం బండ్లగూడ విలేజ్‌లోని పీఅండ్‌టీ కాలనీలో అర ఎకరం పార్కు కబ్జాకు గురవుతున్నదని ఆ కాలనీ నివాసితులు ఫిర్యాదు చేశామేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మాచబొల్లారంలోని ముతుకుల గుంట నీటి విస్తీర్ణం రోజురోజుకు పెరిగిపోతుందని, 4.62ఎకరాల చెరువు ప్రస్తుతం 12 ఎకరాలు ధాటిపోయిందని నివాసితులు వాపోయారు. తూములు బందేసి, అలుగును కూడా పెంచేశారంటూ దీంతో అనుమతి పొందిన లేఔట్‌లు నీటమునుగుతున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## డ్రగ్స్ కేసులో ఇరికిస్తానంటూ బెదిరింపులు.. ఎక్సైజ్ కానిస్టేబుల్ అరెస్ట్

హైదరాబాద్: పలువురు సినీ ప్రముఖులపై వేధింపులకు పాల్పడుతున్న ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను (ఇలిఇతిబవ అనినిబబిజీఎశ్రీవ) టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ శాఖలో కానిస్టుబుల్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు.. ఇన్‌స్పెక్టర్‌గా చెప్పుకుంటూ సినీ సెలబ్రిటీల ఇళ్లకు వెళ్లి మరీ వారిని డ్రగ్స్ కేసులో ఇరికిస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఇంట్లో డ్రగ్స్ దొరికాయంటూ కేసుల్లో ఇరికిస్తానని వేధించాడు. బెదిరింపులు ఎక్కువ కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# 30న తుది ఓటర్ల జాబితా

–సమగ్ర తుది ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి
–17లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి
హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వీ కర్ణన్




హైదరాబాద్, సెప్టెంబర్ 9:జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా సమగ్రంగా సిద్ధం చేసేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు.

భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ఈనెల 2వ తేదీన ప్రచురించామని కమిషనర్ చెప్పారు. ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం 139 లొకేషన్లు, 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా 3 లక్షల 92 వేల 669 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయడంతో పాటు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్లలో కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ప్రతి అర్హులైన ఓటరును జాబితాలో చేర్చేందుకు, తప్పుల్లేని ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని కమిషనర్ చెప్పారు. తుది ఓటర్ల జాబితా ఈనెల 30, 2025న ప్రచురించబడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ వల్లవి విజయవన్‌శి, అదనపు కమిషనర్ (ఎలక్షన్స్) మంగతాయారు హాజరయ్యారు.

రాజకీయ పార్టీల తరపున నందేశ్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), పి.వెంకటరమణ, పవన్ కుమార్ (భారతీయ జనతా పార్టీ), విజయ్ (ఆమ్ ఆద్మీ పార్టీ), ఎం.శ్రీనివాసరావు (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా–మార్క్సిస్టు), రాజేష్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), జయసింహ, కె.మాధవ్ (భారత్ రాష్ట్ర సమితి), జోగేందర్ సింగ్, ప్రశాంత్ యాదవ్ (టీడీపీ), సయ్యద్ ముస్తాక్ (ఏఐఎంఐఎం) తదితరులు హాజరయ్యారు. కాగా సమావేశానికి ముందుగా.. హైదరాబాద్ జిల్లాలో జీఐఎస్ ఆధారిత నజరి నక్ష తయారీ కార్యాచరణ ప్రణాళికపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను(బీఎల్ఏల) నియమించి, పారదర్శకంగా, ఖచ్చితంగా జాబితా సవరణలో భాగస్వాములు కావాలని పార్టీ ప్రతినిధులను కమిషనర్ కోరారు. ఈనెల 17 వరకు దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉందన్నారు. వచ్చే జులై 1, 2025 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న అర్హులైన పౌరులు, ఈనెల 17లోపు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలన్నారు.

జాబితాలో ఏమైనా సవరణలు, మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే సంబంధిత దరఖాస్తు ఫారాలు సమర్పించాలని చెప్పారు. ఇప్పటివరకు ఫారం-6, 6ఏ, 7, 8 ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తులు, అభ్యంతరాల్లో 8.62 శాతం దరఖాస్తులను పరిశరించామని, మిగతా దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశరిస్తామని కర్ణన్ తెలిపారు. ప్రజాప్రతినిధులు సహకరించాలి.

# భారతదేశంలో అనాథగా పడి ఉన్న ఆస్తుల వినియోగంలోకి తేవడంపై సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో భాగంగా ఉన్న ది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఈపీఎఫ్ఏ) సోమవారం (సెప్టెంబరు 8న) తొమ్మిదో స్థాపక దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా, "ఈ ఆస్తులకు వారసులెవరు... వినియోగంలోకి భారతదేశంలో అనాథగా పడి ఉన్న ఆస్తులు (క్లెయిమింగ్ ది అన్‌క్లెయిమ్డ్: అన్‌లాకింగ్ ది పొటెన్షియల్ ఆఫ్ ఐడిల్ ఫైనాన్షియల్ అసెట్స్ ఇన్ ఇండియా) అంశంపై ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు శ్రీ సంజీవ్ సాన్యాల్ ప్రధానోపన్యాసాన్నిచ్చారు. ఉపయోగంలో లేని ద్రవ్య సాధనాలను... దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని... ఫలప్రదమైన రీతిలో వినియోగించుకొనేటట్లు చూడడానికి కొత్త కొత్త ఆలోచనలతో కూడిన విధానాలను రూపొందించడంతో పాటు, వివిధ ఏజెన్సీలు ఒకదానికి మరొకటి సహకరించుకోవాల్సిన అవసరం కూడా ఎంతయినా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఐఈపీఎఫ్ఏ అర్థవంతమైన సంస్కరణలను తీసుకువచ్చిందంటూ శ్రీ సాన్యాల్ ప్రశంసలు కురిపించారు.

ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణను బలపరచడం, క్లెయిముల పరిష్కారాన్ని సులభతరంగా మార్చడంతో పాటు దేశవ్యాప్తంగా ఆర్థిక వ్యవహార జ్ఞ?నాన్ని పెంచేందుకు ఐఈపీఎఫ్ఏ అమలుచేస్తున్న కార్యక్రమాలను ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అనితా షా ఆకెళ్ల వివరించారు. ఆమె సమావేశంలో ప్రారంభోపన్యాసాన్నిచ్చారు.

క్లెయిముల విషయంలో పాటించాల్సిన కాలపరిమితులను కుదించడానికీ, పారదర్శకత్వాన్ని ఇప్పటి కన్నా పెంచడంతో పాటు ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపచేయడానికీ సమన్వయ సహిత సంస్కరణలను తీసుకురావడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిందిగా ఎన్‌సీఏఈఆర్‌లో ఐఈపీఎఫ్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ సి.ఎస్. మహాపాత్రా సూచించారు. ఆయన రౌండ్ టేబుల్ సమావేశంలో సమన్వయకర్త పాత్రను పోషించారు.

సదస్సులో అనుభవజ్ఞ?లైన విధాన రూపకర్తలు, నియంత్రణాధికారులతో పాటు విభిన్న రంగాల నిపుణులు పాల్గొన్నారు. కేపిటల్ మార్కెట్ మొదలు బ్యాంకింగ్ రంగం వరకు వివిధ విషయాలపై ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమాల్లో సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు శ్రీ సునీల్ కదమ్, రిజర్వు బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజరు శ్రీ సునీల్ నాయర్, ఐసీఎస్ఐ పూర్వ ప్రెసిడెంటు, సీఎస్ బి. నరసింహన్ పాలుపంచుకొన్నారు. బీమా, పింఛన్లు, ప్రావిడెంట్ ఫండ్ల ప్రతినిధులుగా వీ ఎఫ్ ఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు సుమిత్ కౌర్ కపూర్, ఐఆర్‌డీఏఐ పూర్వ సభ్యుడు శ్రీ ఆర్.కె. నాయర్ పాల్గొన్నారు. 'పేరడైమ్ షిఫ్ట్: అన్‌లాకింగ్ ది పొటెన్షియల్ ఆఫ్ ఐడిల్ అసెట్స్ అండ్ ఎఫీషియంట్ సర్వీస్' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఐఈపీఎఫ్ఏ మండలి సభ్యుడు, వేల్యూ రిసెర్చ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ ధీరేంద్ర కుమార్, ఎన్ఐఎస్ఎమ్ డైరెక్టరు శ్రీ శశి కృష్ణన్‌లతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ సెక్రటరీ, కాంప్లయన్స్ ఆఫీసరు సావిత్రీ పారేఖ్ తన అవగాహనను పంచుకున్నారు.

క్లెయిము చేయకుండా ఉన్న ద్రవ్య సాధనాలకు వాటి విలువను సద్వినియోగపరిచే దిశలో ఆలోచనలు చేస్తామనీ, ఆర్థిక సేవలను సమాజంలో అన్ని వర్గాల వారికి అందించేటట్లు సంబంధిత వ్యవస్థను పటిష్ఠపరుస్తామనీ, దేశ ఆర్థిక అనుబంధ విస్తారిత వ్యవస్థపై మదుపరుల విశ్వాసాన్ని బలపరుస్తామనీ ఆసక్తిదారులంతా కలిసికట్టుగా వాగ్దానం చేయడంతో ఈ రౌండ్ టేబుల్ సమావేశం ముగిసింది.

ఈ సందర్భంగా ఐఈపీఎఫ్ఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అనితా షా ఆకెళ్ల మాట్లాడుతూ, పారదర్శకత్వానికీ, టెక్నాలజీకీ, విశ్వాసానికీ ప్రాధాన్యాన్ని కట్టబెట్టి అనేక సంస్కరణలను ప్రవేశపెడుతూ మదుపరులకు అభయ ప్రదాతగా తమ సంస్థ పురోగమిస్తోందని స్పష్టం చేశారు. క్లెయిములు, రిఫండులకు ఏకీకృత పోర్టల్ ఏర్పాటు, తక్కువ మొత్తంలో ఉండే క్లెయిముల ప్రక్రియను సరళీకరించడం, ఆర్థిక వ్యవహార సంబంధిత జ్ఞ?నాన్ని పెంపొందించే నివేశక్ దీదీ... నివేశక్ శిబిర్ వంటి కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. త్వరలో నివేశక్ సమాధాన్– దయల్ యువర్ సీఈఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సంస్థ పంచతత్వ దృష్టికోణాన్ని అనుసరిస్తోందని కూడా వివరించారు. రిఫండ్లను త్వరగా అందించడం, ఏఐ ఆధారిత చర్యలు తీసుకోవడం, భారత ఆర్థిక వ్యవస్థకు కీలక వెన్నుదన్నుగా ఐఈపీఎఫ్ఏను తీర్చిదిద్దడం ఈ దృష్టికోణంలో భాగాలేనన్నారు. ఐఈపీఎఫ్ఏ ప్రభావశీలత్వాన్ని సంస్థ సేవలను అందుకుంటున్న వర్గాల కోణంలో నుంచి అంచనా వేయాలని స్పష్టం చేశారు.

ది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఈపీఎఫ్ఏ)ను కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో భాగంగా 2016 సెప్టెంబరు 7న ఏర్పాటు చేశారు. ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండును నిర్వహించడం ఐఈపీఎఫ్ఏ బాధ్యత. షేర్లు, క్లెయిము చేయని డివిడెండ్లు, గడువు తీరిన డిపాజిట్లతో పాటు డిబెంచర్ల రిఫండుకు మార్గాన్ని సుగమం చేస్తూ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో దీనిని స్థాపించారు. ఐఈపీఎఫ్ఏ తన కార్యక్రమాల మాధ్యమంతో పారదర్శకత్వానికి పూచీపడుతూ, ఇన్వెస్టర్ల హక్కులను రక్షించడంతో పాటు దేశం అంతటా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన అవగాహనను ప్రోత్సహిస్తోంది.

# గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాల్సిందే.. కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 9:గ్రూప్–1 మెయిన్స్ రీవాల్యుయేషన్ చేసినా నిరుద్యోగ అభ్యర్థులకు నమ్మకం కలగదు.. వారికి భరోసా కలగాలంటే మరోసారి పరీక్షలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గ్రూప్–1 రిక్రూట్‌మెంట్‌లో తప్పు ఎక్కడ జరిగింది, రీవాల్యుయేషన్లో ఇంత పెద్ద మిస్టేక్స్ ఎలా జరిగాయో, ఈ పోస్టులను ఎవరు అమ్ముకున్నారో బయటకు రావాలంటే జ్యుడిషియల్ కమిషన్ వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి, లేదంటే రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేయాలి. భవిష్యత్‌లో ఇలాంటివి జరగొద్దంటే జ్యుడిషియల్ కమిషన్ వేసి నిజాలు నిగ్గు తేల్చాలని కేటీఆర్ అన్నారు. నంది నగర్‌లోని తన నివాసంలో నిరుద్యోగ అభ్యర్థులతో సమావేశం అనంతరం వారితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

తెలంగాణలోని నిరుద్యోగ యువత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధి నాయకత్వం, రాహుల్ గాంధీ చెప్పిన మాటలను విశ్వసించి ఆ పార్టీకి ఓటేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు చెప్పింది. ఇది కాంగ్రెస్ గ్యారెంటీ అంటూ అశోక్ నగర్ దాకా వచ్చి నమ్మబలికే విధంగా వాగ్దానం ఇచ్చారు. వారి మాటలను నమ్మి కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలనే సంకల్పంతో ఇవాళ ఇక్కడున్న వారంతా మాకు వ్యతిరేకంగా ప్రచారం చేసి మమ్మల్ని ఓడించడానికి శతవిధాలా ప్రయత్నించారు. వారంతా కూడా రాహుల్ గాంధీ మాటలను నమ్మారు. 2 లక్షల ఉద్యోగాలంటే నమ్మి కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మా తలరాతలు మారుతాయి.. మా బతుకులు మారుతాయి ఉద్యోగాలు వస్తాయని చెప్పి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అందర్నీ మెప్పించి ఒప్పించి బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న వాతావరణాన్ని కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మలిచే దాంట్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన నిరుద్యోగ యువత వీరు. కానీ వారి ఆశలను ఆడియాశలను చేస్తూ.. జాబ్ క్యాలెండర్ అని చెప్పి మోసం చేశారు. ఈ శతాబ్దపు అది పెద్ద మోసం అయి ఉంటుంది 2 లక్షల ఉద్యోగాల భర్తీ అని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్రూప్ –1 రిక్రూట్‌మెంట్‌లో భాగంగా 500 ఉద్యోగాలకు కేసీఆర్ నోటిఫికేన్ ఇస్తే కాంగ్రెస్ దాన్ని రద్దు చేసి అదనంగా 63 పోస్టులు జోడించి.. అంటే 563 ఉద్యోగాలకు ఫ్రెష్ రిక్రూట్‌మెంట్ అని చెప్పి ఎగ్జామ్ పెట్టారు. కేసీఆర్ హయాంలో టీఎస్‌పీఎస్సీ పరీక్ష లీకైందని నిఘా వ్యవస్థ ద్వారా సమాచారం రాగానే.. సీఎంగా కేసీఆర్ నిర్ణయం తీసుకుని.. సరిదిద్దాలనే ఉద్దేశంతో ఆ పరీక్షను రద్దు చేశారు. కానీ ఈ ప్రభుత్వం 563 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించగా అవకతవకలు జరిగాయి. కేసీఆర్ ఇచ్చిన 55 జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు న్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 ద్వారా అన్యాయం జరుగుతుంది.. దయచేసి సవరించండి అంటే సవరించ లేదు.. పెడచెవిన పెట్టారు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

ఇక ఎగ్జామ్స్ ఫలితాలు వెలువడిన తర్వాత తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని అక్రోశించినా పట్టించుకోలేదు. కొన్ని సెంటర్లలో ఉన్నవారికి ఎక్కువ మార్కులు వచ్చాయని, వరుసగా రూల్ నంబర్లు ఉన్నావారికి ఎక్కువ మార్కులు వచ్చాయని కుంభకోణం జరిగిందని నిరుద్యోగ అభ్యర్థులు ఆధారాలతో ఆరోపించారు. ఉద్యోగాలను అమ్ముకున్నారని సవరించండి అని ప్రభుత్వం వద్దకు వెళ్లినా న్యాయం జరగేలదు. చివరకు విధిలేక కోర్టును ఆశ్రయిస్తే ఇవాళ శుభవార్త చెప్పింది. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల్లో లోటు పాట్లు జరిగాయని.. రీవాల్యుయేషన్ చేయాలని, లేదంటే మళ్లీ పరీక్షలకు వెళ్లాలని హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా భేషజాలకు వెళ్ళి, విద్యార్థుల జీవితాలను ఆగం చేయకండి. విద్యార్థుల కష్టంతో మీరు గద్దెనెక్కి కూర్చున్నారు కాబట్టి వారికి రాజకీయ రంగు పూలమకుండా న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

## చైనీస్ టెక్నాలజీతో పౌరులపై నిఘా పెట్టిన పాకిస్తాన్: ఆమ్నెస్టీ రిపోర్ట్

ఇస్లామాబాద్ సెప్టెంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కోట్లాది మంది దేశ ప్రజలపై పాకిస్థాన్ నిఘా పెట్టింది. ఫోన్ ట్యాపింగ్ సిస్టమ్ ద్వారా ఆ స్పైయింగ్ జరుగుతోంది. చైనా నిర్మించిన ఇంటర్నెట్ ఫైర్‌వాల్ ద్వారా పాకిస్తాన్‌లో సోషల్ మీడియాను సెన్సార్ చేస్తున్నారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొన్నది. మంగళవారం దీనికి సంబంధించిన రిపోర్టును రిలీజ్ చేశారు. చైనీస్, పాశ్చాత్య టెక్నాలజీ ద్వారా నిర్మించిన మానిటరింగ్ నెట్వర్క్‌తో ప్రజలపై నిఘా పెడుతున్నట్లు ఆమ్నెస్టీ పేర్కొన్నది. పాకిస్థాన్‌లో పొలిటికల్, మీడియా స్వేచ్ఛపై ఇప్పటికే ఆంక్షలు ఉన్నాయి. లాఫుల్ ఇంటర్‌సెప్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఎల్ఐఎంఎస్) ద్వారా సుమారు 40 లక్షల మొబైల్ ఫోన్లను ట్యాపింగ్ చేసే సామర్థ్యం పాకిస్థాన్ నిఘా ఏజెన్సీలకు ఉన్నట్లు తెలుస్తోంది. డబ్ల్యూఎంఎస్ 2.0 ఫైర్‌వాల్ ద్వార సుమారు 20 లక్షల యాక్టివ్ యూజర్లను ఒకేసారి స్తంభింపచేసే అవకాశాలు ఉన్నట్లు ఆమ్నెస్టీ పేర్కొన్నది. రెండు రకాల మానిటరింగ్ వ్యవస్థలు ఉన్నాయని, కాల్ ట్యాపింగ్.. టెక్ట్స్‌లను ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు తెలుసుకోవచ్చు అని, దేశవ్యాప్తంగా వెబ్‌సైట్లు, సోషల్ మీడియాను బ్లాక్ చేసే విధంగా టెక్నాలజీ కూడా ఉందని ఆమ్నెస్టీ చెప్పింది. ఎల్ఐఎంఎస్ సాఫ్ట్‌వేర్‌కు కనెక్ట్ కావాలని దేశంలోని నాలుగు మొబైల్ ఆపరేటర్లకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని ఆమ్నెస్టీ టెక్నాలజీ నిపుణుడు జూరీ వాన్ బెర్జ్ తెలిపారు.

## జీవనకాల గరిష్టానికి చేరుకున్న బంగారం ధర..

### పసిడి ప్రియులు ఆందోళన

హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: బంగారం కొనాలంటే ఇక మధ్యతరగతి కుటుంబాలు ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిందే. ఎందుకంటే బంగారం ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వరుసగా బంగారం ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో బంగారం కొనాలనే ఆలోచనే చాలామంది చేయడం లేదు. తాజాగా బంగారం రికార్డు సృష్టించింది. 10 గ్రాముల పసిడి మరింత ప్రియమైంది. 10 గ్రాముల బంగారం ధర జీవనకాల గరిష్టానికి చేరుకుంది. మంగళవారం ఒక్కరోజే ఏకంగా 10 గ్రాముల బంగారం ధర రూ.5,080లు పెరిగింది. దీంతో 10 గ్రాముల బంగారం ధర రూ.1.12 లక్షలకు చేరుకుంది. బంగారం ధర ఈస్థాయికి చేరుకోవడంతో పసిడి ప్రియులు ఆందోళన చెందుతున్నారు.

# అవినీతి మరియు చెడు పాలన - ప్రజల పాలిట శాపం

–సిటిజన్ ఫోరం,జన్ సేవా సంఘ్,అభిప్రయ్ సంస్థల ఆందోళన




హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సిటిజన్ ఫోరం తెలంగాణ, జన్ సేవా సంఘ్ హైదరాబాద్, మరియు అభిప్రయ్, హైదరాబాద్ తెలంగాణలో పాలనా దుస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసాయి . అవినీతి మరియు చెడు పాలన – ప్రజల పాలిట శాపం మారిందని ఆందోళన వ్యక్మమ్ చేసాయి హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం సిటిజన్ ఫోరం,జన్ సేవా సంఘ్ మరియు అభిప్రయ్ ప్రతినిధులు రాజీవ్ చౌబే, బినిత్ సింగ్, వి డి చౌబే, మదన్ లాల్ రావల్, సీతారాం ఠాకూర్, ఎల్ ఎమ్ చౌదరి లు మాట్లాడుతూ ప్రజా జీవితంలో అవినీతి మరియు కాలక్రమేణా వరుసగా చెడు పాలన రాష్ట్ర పురోగతికి మరియు ప్రజల సంక్షేమానికి అతిపెద్ద అడ్డంకిగా మారాయన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్న అవినీతి, అధికారులను చేరుకోలేకపోవడం మరియు విపరీతంగా పెరిగిపోయిన ఎర్రచందనం సాధారణ పౌరుల పాలిట శాపంగా మారిందని ఈ మూడు సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు.తెలంగాణ అఃః నమోదు చేసిన వందలాది కేసులు కోర్టులలో పెండింగ్లో ఉన్నాయి, మరికొన్ని కేసులు ప్రభుత్వం నుండి అనుమతి ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నాయి. రాజకీయ పార్టీలు అవినీతిని వాస్తవంగా సమస్యగా తగ్గించాయి మరియు వివిధ స్థాయిలలోని ప్రభుత్వ అధికారులు తక్కువ జవాబుదారీతనం లేదా నైతిక బాధ్యతను చూపిస్తున్నారన్నారు.వివిధ విభాగాల హెల్ప్లైన్లు పనిచేయవు. బాగా ప్రచారం చేయబడిన సిటిజన్ చార్టర్ కేవలం లాంఛనప్రాయంగా నిరూపించబడింది. గత కొన్ని సంవత్సరాలుగా, సిటిజన్ ఫోరం తెలంగాణ మరియు జన్ సేవా సంఘ్ హైదరాబాద్ ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మరియు ఇతర అధికారులకు వందలాది లేఖలు రాసాయి, కానీ ఈ విజ్ఞప్తులకు పెద్దగా సమాధానం రాలేదని పెర్కొన్నారు.దీని దృష్ట్యా, పాలనలో సమగ్రత, సామర్థ్యం మరియు జవాబుదారీతనం పునరుద్ధరించడానికి ఈ క్రింది తక్షణ చర్యలు తీసుకోవాలని సంస్థలు డిమాండ్ చేసారు. 1) తెలంగాణ జైళ్ల శాఖ 6 సంవత్సరాల క్రితం చేసినట్లుగా, అవినీతి మరియు రెడ్–ట్యాపిజమ్ను తనిఖీ చేయడానికి విభాగాధిపతులు (హెచ్ఓడీలు) ప్రత్యక్ష బాధ్యత వహించాలని,2) ఏసీబీ పట్టుకుని ఛార్జ్ షీటు చేసిన అధికారులను ఫీల్డ్ అసైన్మెంట్లలో నియమించకూడదని,3) ప్రభుత్వ ఉద్యోగుల అంతర్గత విచారణలు, బాహ్య సర్వేలు మరియు అవగాహన ఆడిట్లను నిర్వహించడానికి ప్రతి విభాగంలో చురుకైన విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని,4) ఫైల్ క్లియరెన్స్ కోసం కాలపరిమితిని నిర్ణయించాలని, జాప్యాలు విచారణకు దారితీయాలి మరియు బాధ్యతాయుతమైన అధికారుల జవాబుదారీతనం నిర్ణయించాలని, ఫైల్ను కాలపరిమితికి మించి పెండింగ్లో ఉంచిన బాధ్యతాయుతమైన అధికారుల నుండి జీతం తగ్గించాలని,5) సీనియర్ అధికారులతో కూడిన క్రియాత్మక నియంత్రణ గదిని పౌరుల సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేయాలని,6) అర్థరహిత ప్రజా దర్బార్లను ఉద్దేశపూర్వకంగా చేయాలని డిమాండ్ చెసారు.అవినీతి, అందుబాటులో లేకపోవడం మరియు రెడ్–టేపిజం నిర్మూలించబడకపోతే, తెలంగాణ ప్రజలు బాధపడుతూనే ఉంటారు మరియు నిజమైన పురోగతి అస్పష్టంగానే ఉంటుందన్నారు.

**చర్యకు పిలుపు**

సిటిజన్ ఫోరం తెలంగాణ, జన్ సేవా సంఘ్ హైదరాబాద్ మరియు అభిప్రయ్ హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వాన్ని నిర్ణయాత్మకంగా వ్యవహరించి విస్తృత ప్రజా ప్రయోజనాల కోసం ఈ చర్యలను అమలు చేయాలని వారు పిలుపునిచ్చారు. పౌరులు అప్రమత్తంగా ఉండాలని, సమిష్టిగా తమ గొంతులను వినిపించాలని మరియు పాలనలో జవాబుదారీతనం కోరాలని కూడా ఈ సంస్థలు విజ్ఞప్తి చేసారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వంటి పెద్ద అవినీతి సామాన్య ప్రజలను తక్కువ ప్రభుత్వ కార్యాలయాల్లోని చిన్న అవినీతిని ప్రభావితం చేసినంతగా ప్రభావితం చేయదన్నారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ లో మొహమ్మద్ మునవర్, శ్రీనివాస్ యాదవ్, దినేష్ చందన్, సుమిత్ చౌబే, సుబోధ్ సింగ్, హరి సింగ్, సుశీల్ శ్రీవాస్తవ్, ఎ కె మిశ్రా, రాజీవ్ కుమార్, వినోదా లక్ష్మి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాతో వాణిజ్య చర్చలపై భారత్ ఏదోఒక రోజు దిగిరావాల్సిందే

–లేదంటే ఢిల్లీకి మంచి ముగింపు ఉండదు
–ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో తీవ్ర స్థాయిలో హెచ్చరిక

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో భారత్ పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో వాణిజ్య చర్చలపై భారత్ ఏదోఒక సమయంలో దిగిరావాల్సిందేనని వ్యాఖ్యానించారు. లేదంటే ఢిల్లీకి మంచి ముగింపు ఉండదంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. న్యూస్‌ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో నవారో మాట్లాడుతూ.. అమెరికాపై ప్రపంచంలోని ఏ దేశం వేయని టారిఫ్‌లు భారత్ వసూలుచేస్తోందని ఆరోపించార

ఏ. ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించకముందు మాస్కో నుంచి భారత్ తక్కువగానే చమురు ( కొనుగోలు చేసేదని.. యుద్ధం తర్వాత పెద్దమొత్తంలో లాభం పొందేందుకు ఎక్కువగా కొనుగోలు చేస్తోందన్నారు. భారత్ వీలైనంత తొందరగా అమెరికాతో ఒప్పందం చేసుకుంటే మంచిదని నవారో వ్యాఖ్యానించారు. యూరోపియన్ యూనియన్, జపాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటి దేశాలు అమెరికాతో ఇప్పటికే వాణిజ్య ఒప్పందాల కుదుర్చుకున్నాయని గుర్తుచేశారు.

